


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| శుక్రవారం 05 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 02 సంచిక : 003 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## ఉద్యమకారులందరికీ న్యాయం చేస్తాం

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 05, ప్రతినిధి: తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కే. కేశవరావు తెలిపారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల గుర్తింపుపై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించినట్లు చెప్పారు. ఉద్యమంతో సంబంధం ఉన్న విద్యార్థి సంఘాలు, న్యాయవాదులు, వైద్యులు, జర్నలిస్టులు తదితర వర్గాలతో కూడా త్వరలో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. తొలి తరం ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ఉద్యమకారుల ఐడెంటిటీపై విభాగాల వారీగా పని చేపడతామని పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన అన్ని పార్టీలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని అభినందించినట్లు వెల్లడించారు. కమిటీ నివేదికను సమయపాలనతో సిద్ధం చేయాలని ఆలోచిస్తున్నామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి గౌరవించేందుకు కట్టుబడి ఉందన్నారు. రాజకీయ పార్టీలతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కవులు, కళాకారులు తదితర ఉద్యమంలో భాగమైన వారందరినీ గుర్తిస్తామని చెప్పారు. గాయపడిన వారు, నష్టం చెందిన వారికి న్యాయం చేస్తామని తెలిపారు. ఉద్యమకారుల కమిటీ కార్యాలయాన్ని అమరవీరుల ద్వీపంలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ప్రజల నుండి సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అన్ని జేఏసీలు, యూనివర్సిటీ విద్యార్థి సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఉద్యమంలో తమ జీవితాలు, యవ్వనం కోల్పోయామని పలువురు బాధితులు చెబుతున్నారని, వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ అన్ని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, అన్ని వర్గాలతో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. 1969 తెలంగాణ ఉద్యమకారులను కూడా గుర్తించాలని సూచనలు వచ్చాయని తెలిపారు. ఉద్యమంలో మరణించిన వారు, గాయపడిన వారు, కేసులు ఎదుర్కొని జైలుకు వెళ్లిన వారందరినీ గుర్తించి గౌరవించాలని ముఖ్యమంత్రి ఆలోచనగా వెల్లడించారు.

## ఎంఎన్‌కేఎల్ఐఎస్ పనులను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి





సందేశం టైమ్స్, నారాయణపేట, జూన్ 05, ప్రతినిధి: మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం (ఎంఎన్‌కేఎల్ఐఎస్) పనుల పురోగతిని ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, ప్లాన్ మ్యాప్స్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నీటి పారుదల ప్రాజెక్టుల పనులను పరిశీలించేందుకు బెంగుళూరు నుంచి నేరుగా నారాయణపేట జిల్లా మక్తల్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి మొదటగా ఎత్తిపోతల పథకంపై జరుగుతున్న పనులను వివరించే ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం మక్తల్ మండలం కాట్రేవుపల్లి గ్రామ సమీపంలోని ప్యాకేజీ-1 సైట్ వద్దకు చేరుకుని పంప్ హౌస్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను వెంటనే ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు , , , , కర్నాటక మాజీ మంత్రి , ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎన్డీయే కూటమి నేతల కీలక సమావేశం



సందేశం టైమ్స్, అమరావతి, జూన్ 05, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి నేతల కీలక సమావేశం ముఖ్యమంత్రి నివాసంలో ప్రారంభమైంది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి , ఏపీ బీజేపీ అధ్యక్షుడు పాల్గొన్నారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక, రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నట్లు సమాచారం. రాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

## సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి

**భూసేకరణ పూర్తి చేస్తేనే ప్రాజెక్టుల పనులకు వేగం: అధికారులకు సీఎం ఆదేశాలు**






సందేశం టైమ్స్, మహబూబ్‌నగర్, జూన్ 05, ప్రతినిధి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొనసాగుతున్న అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పలు సాగునీటి ప్రాజెక్టుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తవ్వాలంటే ముందుగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూసేకరణ పూర్తి కాకుండా ప్రాజెక్టు పనులు ముందుకు సాగవని పేర్కొన్నారు. సంబంధిత జిల్లాల కలెక్టర్లు స్థానిక ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షిస్తూ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణకు అవసరమైన నిధులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు , , , , ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో పెట్టుబడులపై రష్యా సంస్థలతో కీలక చర్చలు







సందేశం టైమ్స్, సెయింట్ పీటర్స్‌బర్గ్, జూన్ 05, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో భారీ పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రష్యా సంస్థలతో కీలక చర్చలు కొనసాగిస్తోంది. రష్యాకు చెందిన ప్రముఖ మెటలర్జికల్ హోల్డింగ్ కంపెనీ చైర్మన్ తో జరిగిన సమావేశంలో భారత్‌లో ఉన్నత శ్రేణి రీబార్, వైర్ రాడ్‌ల తయారీకి అత్యాధునిక ఈఏఎఫ్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఏపీలోని శ్రీసిటీలో తక్షణ రైల్వే సైడింగ్ కనెక్టివిటీతో స్ట్రక్చరల్ సెక్షన్, రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లును స్థాపించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు మాస్కో రవాణా మంత్రి, వైస్ మేయర్ తో సమావేశమై భారత్‌లోని మెట్రో నగరాల్లో మాస్కో తరహా ఏఐ ఆధారిత ట్రాన్సిట్ ట్రాకింగ్, స్మార్ట్ ట్రాఫిక్ నిర్వహణ సాఫ్ట్‌వేర్ అమలు కోసం సహకారం అందించాలని కోరారు. అదేవిధంగా అధిక సామర్థ్యం గల ఎలక్ట్రిక్ బస్సులు, స్మార్ట్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల ఏర్పాటులో ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పని చేయాలని విజ్ఞప్తి చేశారు.

## జనసేన సంస్థాగత బలోపేతానికి కీలక అడుగు




సందేశం టైమ్స్, అమరావతి, జూన్ 05, ప్రతినిధి: నాయకత్వంలోని జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో 28 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ కమిటీలలో ఒక పరిశీలకుడు, ముగ్గురు సీనియర్ నాయకులు, ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా సభ్యత్వాలు నమోదు చేసే ముగ్గురు సాధకులు, వీరితో సమన్వయం చేస్తూ పనిచేసే మరో 21 మంది సాధకులు ఉంటారు. కమిటీల నుంచి వచ్చే నివేదికలను అధ్యయనం చేసి, సమర్థత, పార్టీ పట్ల విధేయత, ప్రజల కోసం పనిచేసే నిబద్ధత వంటి నాయకత్వ లక్షణాలను పరిగణనలోకి తీసుకుని పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తుది నిర్ణయం తీసుకుని నాయకత్వ నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.



## కర్దనూరులో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన

సందేశం టైమ్స్, పటాన్చెరు, జూన్ 05, బి డేవిడ్: పటాన్చెరు ముత్తంగి డివిజన్ పరిధిలోని కర్దనూరు గ్రామంలోని సిద్ధార్థ కాలనీలో రూ.65 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం ఉదయం పటాన్చెరు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, కుమార్, ఇంజనీరింగ్ విభాగం డీఈ కృష్ణవేణి, ఏఈ ఫైజన్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.








## గ్రామసభల్లో ప్రజలకు అవగాహన కల్పించిన కోదాడ రూరల్ పోలీసులు

సందేశం టైమ్స్, కోదాడ, జూన్ 05, ప్రతినిధి: కోదాడ రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' గ్రామసభలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో కోదాడ రూరల్ పోలీసులు చురుగ్గా పాల్గొని ప్రజలకు పలు సామాజిక అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే అందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం మరియు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. మహిళలు, యువతుల రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్స్‌ను సంప్రదించాలని సూచించారు. గ్రామాల్లో జూదం, బెల్ట్ షాపులు, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వానాకాలం సాగు సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, నకిలీ విత్తన విక్రేతల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్న ఈ గ్రామసభల్లో పోలీసుల అవగాహన కార్యక్రమాలు స్థానికుల్లో చైతన్యం నింపాయి.



## గృహిణి అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు

సందేశం టైమ్స్, పటాన్చెరు, జూన్ 05, బి డేవిడ్: పటాన్చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పీఎన్ఆర్ టౌన్‌షిప్‌కు చెందిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం లక్ష్మి(29) బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో భర్త సిద్ధు బంధువులు, తెలిసిన వారి వద్ద గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## బడి బాట సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్





సందేశం టైమ్స్, మెదక్, జూన్ 05, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన విద్యా ప్రమాణాల లక్ష్యంగా ముందుకు సాగుతూ బడి బాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల నమోదు తక్కువగా ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామంలోని ప్రతి ఒక్కరిని విద్యార్థుల నమోదు కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని తెలిపారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి కనీస సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసే మౌలిక వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించాలని, వాటి ఆధారంగానే పాఠశాలలకు ప్రగతి సూచికలు ఇవ్వబడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఆర్ఎస్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని భవిత కేంద్రాలను బలోపేతం చేయాలని, కొత్త ప్రీ ప్రైమరీ విభాగాలను ప్రారంభించాలని, విద్యార్థుల సంఖ్య తగ్గిన పాఠశాలలను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠ్యపుస్తకాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల ద్వారా విద్యార్థుల యూనిఫాంల కుట్టింపు, ఏఐ ఆధారిత డిజిటల్ తరగతుల నిర్వహణ వంటి అంశాల్లో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజు, ఏఎంఓ సుదర్శనమూర్తి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక గ్రామసభలతో ప్రజా సమస్యలకు పరిష్కారం

### అదనపు కలెక్టర్ నగేష్





సందేశం టైమ్స్, మెదక్, జూన్ 05, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు శంకరంపేట ఆర్ మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా అదనపు కలెక్టర్ హాజరై గ్రామస్థులతో సమావేశమయ్యారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, హార్టికల్చర్ అధికారి తదితర జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మురికి కాలువల శుభ్రత, పిచ్చి మొక్కల తొలగింపు, తాగునీటి వనరులు, వాటర్ ట్యాంకుల పరిశుభ్రత, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని పేర్కొన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ రూల్స్–2026ను గ్రామపంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలని, తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. గ్రీన్ బుట్టలో తడి వ్యర్థాలు, బ్లూ బుట్టలో పొడి వ్యర్థాలు, రెడ్ బుట్టలో శానిటరీ వ్యర్థాలు, నల్ల బుట్టలో ప్రత్యేక వ్యర్థాలను వేరు చేసి గ్రామపంచాయతీకి అందించాలని ప్రజలకు సూచించారు. గ్రామసభలో తాగునీటి నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026), పంటల మార్పిడి, బడిబాట కార్యక్రమం, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ తదితర అంశాలపై అధికారుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి స్వచ్ఛత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు, వ్యవసాయ అధికారి దేవకుమార్, హార్టికల్చర్ అధికారి ప్రతాప్‌సింగ్, సర్పంచ్ సంతోష్ నవీన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించిన చింతకాని పోలీసులు



సందేశం టైమ్స్, చింతకాని, జూన్ 04, ప్రతినిధి: 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా చింతకాని మండలం వందనం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో చింతకాని పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణ, గంజాయి నిర్మూలన, రోడ్డు భద్రత ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై వీరేందర్ మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ మోసగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో అమాయకులను మోసం చేస్తున్నారని, వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు, బ్యాంక్ వివరాలను ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయకూడదన్నారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతోందని, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాల్లో గంజాయి దందా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయికి బానిసైన యువతకు కౌన్సెలింగ్, డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. యువతను క్రీడలు, యోగా, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల వైపు మళ్లించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అతివేగాన్ని నియంత్రించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ వినియోగం, మద్యం సేవించడం వంటి పరధ్యానాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఇతర శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మల్కాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు



సందేశం టైమ్స్, మెదక్, జూన్ 05, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: టేక్మాల్ మండల కేంద్ర పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో గ్రామ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సౌకర్యార్థం సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ తెలిపారు. తన ప్రియ మిత్రులు మునోత్ గణేష్, గుగులోత్ పాండ్యల కోరిక మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారావు దేశ్‌పాండే మాట్లాడుతూ గ్రామ భద్రత కోసం ఆధునిక సాంకేతిక సదుపాయాల వినియోగం ఎంతో అవసరమని పేర్కొన్నారు.



## నర్సాపూర్‌లో రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల ప్రారంభం

సందేశం టైమ్స్, మెదక్, జూన్ 05, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ 8వ వార్డులో రోడ్డు మరియు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ సాయి కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్, కౌన్సిలర్లు సుధీర్ గౌడ్, అంజినేయులు గౌడ్, ఇల్యాస్ ఖాన్, చింతకుంట శ్రీకాంత్, నిరంజన్, బాల్‌రెడ్డి రాజు, మొయిజ్, భిక్షపతి, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## పుస్తక రచనతో చిన్నారికి అంతర్జాతీయ గుర్తింపు

సందేశం టైమ్స్, అందోల్, జూన్ 05, మండల ప్రతినిధి: అందోల్ మండలానికి చెందిన చిన్నారి అరుదైన ప్రతిభను కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఆమె రచించిన పుస్తకానికి ప్రముఖ ప్రచురణ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో "హానర్ రోల్ సర్టిఫికేట్ – 2026" ప్రదానం చేశారు. చిన్న వయసులోనే పుస్తక రచన చేపట్టి తన ప్రతిభను చాటుకున్న లాస్య ప్రియ సాధించిన ఈ విజయంపై కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. విద్యతో పాటు సాహిత్య రంగంలోనూ ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగుతున్న ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖులు మాట్లాడుతూ చిన్నారులు తమ ప్రతిభను వెలికితీసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించాలని సూచించారు. లాస్య ప్రియ సాధించిన ఈ ఘనత అందోల్ మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు.











## మొగలాయికోటలో పీఎంఎస్‌బీవై చెక్కు పంపిణీ

సందేశం టైమ్స్, కోదాడ, జూన్ 05, యాదా నవీన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రతా పథకాలు గ్రామీణ ప్రజలకు కొండంత అండగా నిలుస్తాయని కోదాడ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం (ఎఫ్ఎల్‌సీ) కౌన్సిలర్లు పేర్కొన్నారు. అనంతగిరి మండలం మొగలాయికోట గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్‌బీవై) పథకం కింద అర్హులైన లబ్ధిదారునికి బీమా క్లెయిమ్ చెక్కును గురువారం ఘనంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వికలాంగత్వం సంభవించిన సందర్భాల్లో ఈ పథకం ద్వారా కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. అనంతరం గ్రామ ప్రజలకు పొదుపు, డిజిటల్ బ్యాంకింగ్, ప్రభుత్వ బీమా పథకాలు, సరైన ఆర్థిక ప్రణాళికపై విస్తృత అవగాహన కల్పించారు. సూర్యాపేట జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకట నాగ ప్రసాద్ సూచనల మేరకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు మొగలాయికోట గ్రామాన్ని 'మోడల్ గ్రామంగా' ఎంపిక చేసినట్లు ప్రతినిధులు ప్రకటించారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి వంద శాతం బ్యాంకింగ్ సేవలు, సామాజిక భద్రతా పథకాలు, డిజిటల్ లావాదేవీలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, బ్యాంకు అధికారులు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.











## తమ్మరబండపాలెం పెద్ద మోరి కాలువ పూడికతీత పనులు ప్రారంభం

సందేశం టైమ్స్, కోదాడ, జూన్ 05, ప్రతినిధి: కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని తమ్మరబండపాలెం పెద్ద మోరి కాలువ పూడికతీత పనులు గురువారం ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువుల నుంచి వచ్చే వరద నీటి వల్ల స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యగా ఈ పనులు చేపట్టారు. స్థానికులు, వార్డు కౌన్సిలర్ విజ్ఞప్తి మేరకు కోదాడ మున్సిపల్ కమిషనర్ శ్రీదేవి, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను పూర్తిగా తొలగించి వరద నీరు సాఫీగా వెళ్లేలా కాలువను లోతుగా శుభ్రం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీదేవి, కౌన్సిలర్ ఎర్నేని బాబు, స్థానిక ప్రజలు పాల్గొని పనులను పర్యవేక్షించారు. వర్షాలు పడకముందే అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## రూ.87 లక్షల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన





సందేశం టైమ్స్, పటాన్చెరు, జూన్ 05, బి డేవిడ్: పటాన్చెరు నియోజకవర్గం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని హుడా కమాన్ నుంచి రేడియం రోడ్డు వరకు ప్రధాన రహదారిపై మీడియన్, పాత్‌వే నిర్మాణానికి రూ.87 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ఉదయం పటాన్చెరు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు లచ్చిరామ్ నాయక్, బాబ్జి, శ్రీశైలం, శ్రీకాంత్, ఉమేష్, రవీందర్ రెడ్డి, నాగరాజు, బల్దియా ఇంజనీరింగ్ విభాగం డీఈ కృష్ణవేణి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నూతన సబ్‌స్టేషన్లు ఏర్పాటు: ఎమ్మెల్యే జీఎంఆర్

సందేశం టైమ్స్, పటాన్చెరు, జూన్ 05, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నూతన సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్థంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే తెలిపారు. గురువారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, భూ కేటాయింపులు, పూర్తయిన సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలపై ప్రధానంగా చర్చించారు. పటాన్చెరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్మించిన ఇండోర్ సబ్‌స్టేషన్‌తో పాటు సింఫనీ కాలనీ, పోచారం, లకడారం సబ్‌స్టేషన్ల పనులు తుదిదశకు చేరుకున్నాయని, త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. మాదారం, రామేశ్వరంబండ, ఉస్మాన్నగర్, బొల్లారం ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు భూ కేటాయింపులు పూర్తయ్యాయని, ఒక్కో సబ్‌స్టేషన్‌కు ఐదు కోట్ల రూపాయల చొప్పున నిధుల మంజూరుకు సంబంధిత శాఖలకు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో ఇనుప విద్యుత్ స్థంభాలను వెంటనే తొలగించి సిమెంట్ స్థంభాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ ఘాతంతో పశువులు మృతి చెందితే ఆలస్యం చేయకుండా రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని సూచించారు. నూతన సబ్‌స్టేషన్ల కోసం ప్రతిపాదనలు అందితే రెవెన్యూ అధికారులతో చర్చించి భూములు కేటాయిస్తామని తెలిపారు. వేసవికాలంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించిన అధికారులను అభినందించిన ఎమ్మెల్యే, ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరాకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్థంభాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. నిధుల సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే పరిశ్రమల సిఎస్ఆర్ నిధులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డీఈ భాస్కరరావు, ఏడీఈలు సంజయ్, దుర్గాప్రసాద్, నాగరాజు, జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.



## బోరంచ నల్ల పోచమ్మ అమ్మవారి 7 వారాల మహా జాతర ఘనంగా ముగింపు

సందేశం టైమ్స్, మనూర్, జూన్ 05, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: మానూర్ మండలంలోని బోరంచ గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి 7 వారాల మహా జాతర అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిసింది. జాతర సందర్భంగా తెలంగాణతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ మహా జాతరకు పలువురు ప్రముఖులు, సినీ మరియు క్రీడా రంగ ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఏడు వారాల పాటు కొనసాగిన ఈ జాతరలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి కటాక్షంతో సకాలంలో వర్షాలు కురిసి రైతులకు పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులందరిపై అమ్మవారి చల్లని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. మహా జాతర విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన భక్తులు, దాతలు, పోలీసు శాఖ, వైద్య సిబ్బంది, పత్రికా మిత్రులు, గ్రామ పెద్దలు, యువకులు, సేవకులకు ఆలయ కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

## రైతులు అధైర్యపడొద్దు.. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం: కలెక్టర్ ప్రతిమా సింగ్





సందేశం టైమ్స్, మెదక్, జూన్ 05, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: రైతులు అధైర్యపడవద్దని, ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్ నుంచి అధికారులతో నిర్వహించిన గూగుల్ మీట్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు 71,327 మంది రైతుల నుంచి 3,50,620.680 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అలాగే 57,496 మంది రైతులకు రూ.616.93 కోట్ల చెల్లింపులు పూర్తిచేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని 200 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యడంతో ఆయా కేంద్రాలను మూసివేసినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు పూర్తయిన కేంద్రాల్లోని హమాలీలు, లారీలను ఇంకా కొనుగోళ్లు కొనసాగుతున్న కేంద్రాలకు తరలించి వేగంగా అన్‌లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి దేవకుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానంద తదితరులు పాల్గొన్నారు.



## అక్కన్నపేట నగర్ వన్ యోజన పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

సందేశం టైమ్స్, మెదక్, జూన్ 05, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యాచరణలో భాగంగా మెదక్ జిల్లాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుండి జూన్ 12 వరకు ప్రత్యేక పర్యావరణ ఇతివృత్త కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 5 ఉదయం 9:30 గంటలకు మెదక్ జిల్లాలోని అక్కన్నపేట నగర్ వన్ యోజన పార్క్ వేదికగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా పాల్గొననున్న ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణ, ప్రకృతి సమతుల్యత కాపాడటం వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నారు. అలాగే విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మెదక్ జిల్లా అటవీ శాఖ అధికారి జోజి తెలిపారు.



## జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, జూన్ 05, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: జనగణన కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు అత్యంత కీలకమైన ప్రక్రియ అని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జనగణన నిర్వహించాలన్నారు. జనగణన సిబ్బందికి అవసరమైన శిక్షణ, సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా జనగణన సిబ్బందికి సహకరించి సరైన సమాచారాన్ని అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. జనగణన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, జనగణన సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 7న సంగారెడ్డికి కల్వకుంట్ల కవిత రాక – జెండా పండుగకు భారీ ఏర్పాట్లు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 05, ప్రతినిధి: సంగారెడ్డి నియోజకవర్గంలో ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు తెలంగాణ రక్షణ సేన (టి ఆర్ ఎస్) జెండా పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు.సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమానికి భారీ బైక్ ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలతో కవితకు ఘన స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మసన్నగారి బాలయ్య ఆధ్వర్యంలో, సీనియర్ నాయకులు క్రిష్ణ రెడ్డి, మన్నే నవీన్, కరుణాకర్, నితిన్, సాయి, సుధారంజన్ తదితరులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలు, కవిత అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండా పండుగను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నూతన డీఈఓను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్వీ నాయకులు అఖిల్

తెలంగాణ | సంగారెడ్డి జిల్లా

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 05, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)గా బాధ్యతలు స్వీకరించిన ను బీఆర్ఎస్వీ నాయకులు అఖిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో విద్యా రంగ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బత్తుల విక్రమ్, సాయి తదితరులు పాల్గొన్నారు.




## న్యాల్కల్‌లో ఎల్పీజీ పంచాయత్ క్యాంప్ నిర్వహణ

సందేశం టైమ్స్, న్యాల్కల్, జూన్ 05, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: న్యాల్కల్ మండల కేంద్రంలో స్వరాజ్ భారత్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో గురువారం ఎల్పీజీ పంచాయత్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్ల సురక్షిత వినియోగం, గ్యాస్ లీకేజీల గుర్తింపు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. అలాగే ఆన్‌లైన్ బుకింగ్, డిజిటల్ చెల్లింపులు, కేంద్ర ప్రభుత్వ ఉజ్వల పథకం ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు గ్యాస్ సిలిండర్ల సరఫరా ఆలస్యంగా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ మిస్బా, డేవిడ్, డ్రైవర్ రాజు రెడ్డి, సిబ్బంది మణిరామ్, సలీం ఖాన్, సాయితేజ, హరికృష్ణ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.




## అపెక్స్ ఫ్యాక్టరీలో మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

సందేశం టైమ్స్, కాకినాడ, జూన్ 04, 2026, పోలీస్ కార్యాలయం ప్రతినిధి: కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెద్దాపురం అపెక్స్ ఫ్యాక్టరీలో మహిళా కార్మికులకు మహిళా రక్షణ చట్టాలు, పోక్సో చట్టం, శక్తి యాప్, సైబర్ నేరాలు మరియు రోడ్డు భద్రత అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పెద్దాపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ భద్రత కోసం శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఫ్యాక్టరీకి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా పర్యవేక్షణ అవసరమని సూచించారు. హాస్టళ్లలో నివసిస్తున్న ఇతర రాష్ట్రాల మహిళా కార్మికులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని, వారి వివరాలు యాజమాన్యం సేకరించి భద్రపరచాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు 112 అత్యవసర సేవ లేదా శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎస్ఐ మౌనిక, సీఐ వైఆర్‌కే మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## నూతన డీఈఓను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్వీ నాయకులు అఖిల్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 05, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)గా బాధ్యతలు స్వీకరించిన ను బీఆర్ఎస్వీ నాయకులు అఖిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో విద్యా రంగ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బత్తుల విక్రమ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా నన్నక రుహిక పుష్పాలంకరణ వేడుక

సందేశం టైమ్స్, చింతకాని, జూన్ 05, ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ జిల్లా సీనియర్ నాయకులు నన్నక గోపాలరావు, వెంకట నరసమ్మల మనమరాలు (నన్నక శ్రీనివాసరావు – ఉషా దంపతుల ఏకైక పుత్రిక) రుహిక పుష్పాలంకరణ వేడుక గురువారం కోదుమూరు జ్యోతి ఫంక్షన్ హాల్లో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.ఈ వేడుకలో జిల్లా బీఆర్ఎస్ నాయకులు మంకెన రమేష్, బీజేపీ నాయకులు తాటికొండ రామకృష్ణ, సీపీఎం నాయకులు నన్నక కృష్ణమూర్తి, బండ్లమూడి వెంకటేశ్వర్లు, ఆలస్యం నాగేశ్వరరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య, పద్మ, నన్నక నాగేశ్వరరావు, లక్ష్మి తదితరులు చిన్నారి రుహికకు అక్షంతలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక, కుటుంబిక వాతావరణంలో ఘనంగా సాగింది.




## మునిపల్లి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: డీఎంహెచ్ఓ గురుచరణ్

సందేశం టైమ్స్, అందోల్, జూన్ 05, 2026, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్ఓ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోగుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలను కూడా పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.



## విద్యుత్ ఘాతంలో పశువులు మృతి చెందితే తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి: ఎమ్మెల్యే జీఎంఆర్

సందేశం టైమ్స్, పటాన్చెరు, జూన్ 05, బి డేవిడ్: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నూతన సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్థంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే తెలిపారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, భూ కేటాయింపులు, పూర్తయిన సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలపై చర్చించారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఇండోర్ సబ్‌స్టేషన్, సింఫనీ కాలనీ, పోచారం, లకడారం సబ్‌స్టేషన్లు తుదిదశకు చేరుకున్నాయని, త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. మాదారం, రామేశ్వరంబండ, ఉస్మాన్నగర్, బొల్లారం ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు భూ కేటాయింపులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.5 కోట్ల నిధులు మంజూరుకు సంబంధిత శాఖకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇనుప విద్యుత్ స్థంభాలను వెంటనే తొలగించి సిమెంట్ స్థంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ ఘాతంతో పశువులు మృతి చెందితే ఆలస్యం చేయకుండా రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన సబ్‌స్టేషన్ల కోసం ప్రతిపాదనలు అందితే రెవెన్యూ అధికారులతో చర్చించి భూములు కేటాయిస్తామని తెలిపారు. వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా అందించిన అధికారులను అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో కొనసాగాలని కోరారు. మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరాకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న స్థంభాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. నిధుల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే పరిశ్రమల సిఎస్ఆర్ నిధులు సమకూర్చుతానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డీఈ భాస్కరరావు, ఏడీఈలు సంజయ్, దుర్గాప్రసాద్, నాగరాజు, జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

## జోగిపేటలో డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల జాబితాపై అనుమానాలు – అర్హులకు న్యాయం చేస్తాం: కమిషనర్ హామీ



సందేశం టైమ్స్, జోగిపేట, జూన్ 05, అందోల్ నియోజకవర్గ ప్రతినిధి: జోగిపేట మున్సిపల్ పరిధిలో ఇటీవల విడుదలైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల జాబితాపై పలువురు ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జోగిపేట మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, అర్హత ప్రమాణాల ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. ఎవరైనా అర్హుల పేర్లు జాబితాలో లేకపోయినా లేదా అనర్హులు చేరారనే అనుమానాలు ఉన్నా సంబంధిత ఆధారాలతో మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పూర్తిగా పరిశీలించి అవసరమైతే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతుందని, అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అంశం జోగిపేట పట్టణంలో ప్రాధాన్యత సంతరించుకుంది.

## నేరేడిగుంటలో మహిళలకు టైలరింగ్ శిక్షణ కేంద్రం పరిశీలన – సర్పంచ్ సందర్శన



సందేశం టైమ్స్, అందోల్, జూన్ 05, 2026, మండల ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని నేరేడిగుంట గ్రామంలో మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడే ఉద్దేశంతో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ సందర్శించి పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు టైలరింగ్ శిక్షణ ఎంతో ఉపయోగకరమని అన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. శిక్షణ కేంద్రంలో మహిళలకు దుస్తుల కుట్టు, డిజైనింగ్ తదితర అంశాలపై ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ మహిళల అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు, మహిళలు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.